క్లుప్తంగా

పాఠశాలలకు కుర్చీల బహూకరణ



పాఠశాల ఉపాధ్యాయులకు కుర్చీలు అందజేస్తున్న కృష్ణ

కొందుర్గు: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు కె.కృష్ణ పాఠశాలలకు 300ల కుర్చీలు బహూకరించారు. ఈ సందర్భంగా కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని గురుకుల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలకు దాదాపు రూ.1లక్ష రూపాయల విలువగల 300 కుర్చీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

మొయినాబాద్: మండల పరిధిలోని చిలుకూరులో మండల పాస్టర్స్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసినవారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్(ఇమానుయేల్), ఉపాధ్యక్షుడు దయానంద్, కార్యదర్శి సదానంద్, కోశాధికారి ప్రభు, నాయకులు జయవంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

శంకర్‌పల్లి: పట్టణంలోని కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో డా.బీఆర్ అంబేడ్కర్ విద్యాజ్యోతి స్కాలర్‌షిప్ కింద మండలంలోని గోపులారం, మహారాజ్‌పేట్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు బుధవారం పలు అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన ఆరుగురు విద్యార్థులను స్కాలర్‌షిప్ అర్హులుగా ఎంపిక చేశారు. వారికి గురువారం హైదరాబాద్ జోనల్ కార్యాలయంలో ప్రత్యేక అకౌంట్ తెరిచి 5, 6, 7, 8 తరగతుల వారికి రూ.3వేలు, 9, 10 తరగతుల వారికి రూ.5వేలు ఖాతాలో జమ చేశారు. అనంతరం బ్యాంకు మేనేజర్ తిరుపతి మాట్లాడుతూ.. ఎంపిక చేసిన ఆరుగురు విద్యార్థులకు ఏటా స్కాలర్‌షిప్ కింద అమౌంట్ వారి ఖాతాలో జమచేస్తామన్నారు. ఈ స్కాలర్‌షిప్‌లు వారు 10వ తరగతి పూర్తయ్యే వరకు ఏటా జమ చేయనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు సాయం



విద్యార్థినికి నగదు అందజేస్తున్న దాత మల్లేశ్

మొయినాబాద్: పదో తరగతిలో మంచి ప్రతిభ కనబర్చి ఫస్ట్ వచ్చిన విద్యార్థినిని దాత ప్రోత్సహించారు. మండల పరిధిలోని మేడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థిని పి.గిరిజ 8.5 జీపీఏ సాధించి ఫస్ట్ వచ్చింది. గురువారం జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా గ్రామానికి చెందిన దాత, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పి.మల్లేశ్ రూ.20వేల నగదు అందజేసి ప్రోత్సహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటేశ్, మాజీ సర్పంచ్‌లు నవీన్, ప్రవీణ్‌కుమార్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బాల్‌రాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత



పాస్‌బుక్ ఇస్తున్న హెచ్‌ఎం ఆంజనేయులు

మొయినాబాద్‌రూరల్: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కెనరా బ్యాంక్ సంస్థ ద్వారా ఆర్థికసాయం అందిస్తున్నారని హిమాయత్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆంజనేయులు, పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ మహేశ్వరిలు పేర్కొన్నారు. మండల పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో హిమాయత్‌నగర్ కెనరా బ్యాంక్ బ్రాంచ్ సౌజన్యంతో పాఠశాలలో చదువుతున్న 6, 7, 8, 9, 10 తరగతులో ఎస్సీ, ఎస్టీ బాలికలు మొదటి మార్కులు సాధించిన వారికి ప్రతీ సంవత్సరం స్కాలర్‌షిప్ రూపంలో ఆర్థికసాయం అందిస్తారన్నారు. ఇందులో భాగంగా 6, 7, 8 తరగతి విద్యార్థులకు 3 వేల రూపాయల చొప్పున, 9, 10 తరగతుల విద్యార్థులకు 5 వేల రూపాయల చొప్పున అందజేస్తారని తెలిపారు. విద్యార్థులకు పాస్‌బుక్‌తో పాటు చెక్కులను అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఇంజినీర్ పసిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో స్వాతంత్య్ర వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఊరూరా మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి. వీధులు, రహదారులు త్రివర్ణ శోభితంగా మారాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం స్వాతంత్య్ర పోరాట యోధుల త్యాగాలను కొనియాడారు. ఆ మహనీయుల ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని పలువురు సూచించారు.



మొయినాబాద్‌రూరల్: నక్కలపల్లి పాఠశాలలో..



శంకర్‌పల్లి: మున్సిపల్ కార్యాలయంలో..



షాద్‌నగర్‌రూరల్: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు



షాద్‌నగర్‌రూరల్: జెండాకు గౌరవ వందనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, నాయకులు



షాద్‌నగర్‌రూరల్: స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



చేవెళ్లలోని పీఏసీఎస్ కేంద్రం వద్ద జెండా ఆవిష్కరణలో చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య



చేవెళ్ల: ముడిమ్యాల పీఏసీఎస్ వద్ద..



షాబాద్: మండల పరిషత్ కార్యాలయంలో..



షాబాద్: తహసీల్దార్ కార్యాలయంలో..



మొయినాబాద్: మహిళా సమాఖ్య భవనం వద్ద జెండా ఎగురవేస్తున్న ఏపీఎం రవీందర్



నందిగామ: జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ రాజేశ్వర్



కేశంపేట: తహసీల్దార్ కార్యాలయంలో జెండాకు వందనం సమర్పిస్తున్న తహసీల్దార్ అజీం అలీ తదితరులు



కొందుర్గు: కొందుర్గు అంబేడ్కర్ చౌరస్తాలో..



కొందుర్గు: తహసీల్దార్ కార్యాలయంలో..



కొత్తూరు: మున్సిపల్ కార్యాలయంలో..



ఆస్ట్రేలియా మెల్‌బోర్న్ సిటీలో జెండా ఆవిష్కరణలో భారతీయులు

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

మొయినాబాద్: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని మేడిపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్ అన్నారు. మండల పరిధిలోని మేడిపల్లిలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పి.మల్లేశ్ అండ్ ఫ్రెండ్స్ మూడురోజులపాటు నిర్వహించిన మేడిపల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో సీహెచ్.శ్రీనివాస్ జట్టు విజయం సాధించగా ఎం.రమేశ్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. క్రీడలు యువతలో స్నేహభావాన్ని పెంచుతాయన్నారు. విజేతగా నిలిచిన సీహెచ్.శ్రీనివాస్ జట్టుకు రూ.15వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీని అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.10వేల నగదు బహుమతి, ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో స్పాన్సర్ పి.మల్లేశ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ జి.బాల్‌రాజ్, నాయకులు జంగయ్య, మహేందర్, కృష్ణారెడ్డి, నరేశ్, రాజు, గోపాల్, కె.రాజు, కృష్ణ, వెంకటేశ్, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న నాయకులు

దాతల సహకారం మరువలేనిది

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు అందించే సహకారం మరువలేనిదని అంతారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామారావు అన్నారు. మండలంలోని అంతారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా పాల్గొన్న గ్రామ నాయకులు పాఠశాల అభివృద్ధికి తమవంతు సాయంగా విరాళాలు అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంటుందన్నారు. గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి, రిటైర్డు ఉపాధ్యాయుడు ఆర్.అంజయ్యగౌడ్ లక్ష రూపాయల విరాళం పాఠశాల అభివృద్ధికి అందజేశాడని చెప్పారు. అదేవిధంగా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఎస్.అంజన్‌గౌడ్ పాఠశాల క్లీనింగ్, పోడియం అభివృద్ధికి సహకరిస్తానని చెప్పగా గ్రామానికి చెందిన మరో నాయకుడు కావలి వెంకటేశ్‌బాబు పాఠశాలకు విద్యావలంటరీ ఏర్పాటుకు సహకరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. గ్రామానికి చెందిన ఆవుల శ్రావణ్‌కుమార్ విద్యార్థులకు షూ, సాక్సులను అందించారన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు దాతలను ప్రత్యేకంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివకుమార్, బుచ్చిబాబు, రోజ్‌మేరి, విజయకుమారి, ఉమాదేవి, పాఠశాల కమిటీ చైర్మన్ మానేమ్మ, మాజీ చైర్మన్ మానిక్యం, నాయకులు అంజనేయులు, గ్రామస్తులు ఉన్నారు.



హెచ్‌ఎంకు విరాళం అందిస్తున్న దాత రిటైర్డ్ ఉపాధ్యాయుడు అంజయ్యగౌడ్

పాఠశాల అభివృద్ధికి విరాళం

గ్రామాల్లో ఉండే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకురావాలని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని దేవునిఎర్రవల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి దాత సామ రంగారెడ్డి గురువారం లక్ష రూపాయల విరాళం అందించారు. గ్రామ మాజీ సర్పంచ్ సామ మానిక్యరెడ్డి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు గొల్లపల్లి, ధర్మసాగర్ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నందుకు దాతలను గ్రామస్తులందరూ కలిసి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాములు, ఉపాధ్యాయుడు వీరయ్య, మాజీ సర్పంచ్‌లు అంజయ్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

హిందువులపై దాడులు బాధాకరం

కమ్మెటలో నిరసన ర్యాలీ

చేవెళ్ల: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు చేయడం బాధాకరమని కమ్మెట నాయకులు పేర్కొన్నారు. మండలంలోని కమ్మెట గ్రామంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ ఎక్కడ కూడా జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మాధవ్‌గౌడ్, అంజన్‌గౌడ్, గుజరయ్య, రాజు, శశి, గోపాల్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులను తొలగించాలని వినతి

కేశంపేట: గ్రామంలో ఉన్న బెల్టుషాపులను తొలగించాలని గ్రామ యువజన సంఘం సభ్యులు ఎస్ఐ రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి విద్యావతికి బుధవారం వినతి పత్రాలు అందించారు. కేశంపేటలో విచ్చలవిడిగా బెల్టుషాపులు ఉండటం 24గంటలు అందుబాటులో మద్యం దొరకడంతో విచ్చలవిడిగా తాగుతున్నారని యువజన సంఘం సభ్యులు తెలిపారు. దీంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కార్యక్రమంలో పవన్‌కుమార్‌రెడ్డి, శివాజీ, మురళీమోహన్, అమ్రేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సిమెంట్ అందజేత

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మైసమ్మ దేవాలయానికి గ్రామస్తుల కోరిక మేరకు గ్రామానికి చెందిన దాత చింతకింది వెంకటేశ్‌గౌడ్ వంద బస్తాల సిమెంట్‌ను ఇస్తానని హామీనిచ్చారు. అందులో భాగంగా గురువారం మొదటి విడతగా 50 బస్తాల సిమెంట్‌ను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారాన్ని అందిస్తానని దాత వెంకటేశ్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో యాదగిరి, రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగ్స్ పంపిణీ

షాబాద్: పేద విద్యార్థులకు సహకారం అందించేందుకు దాతలు ఎంతో కృషి చేస్తున్నారని తాళ్లపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని తాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో దాతలు ఏట్ల ఎర్రవల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ పీసరి రాజశేఖర్‌రెడ్డి విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. అదే గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పీసరి వినయ్‌కుమార్‌రెడ్డి పాఠశాలకు మైక్‌సెట్‌ను అందజేశారు. గోపాల్‌నాయుడు టై, బెల్ట్, బ్యాచ్‌లు విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగిరెడ్డి, సంఘమేశ్వర్‌రెడ్డి, కిరణ్మయి, గ్లోరీ, శోభారాణి, మొగులయ్య, బాలకృష్ణ, శీతాబాయి, లలిత, మంజుల, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



దాతలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

పాఠశాలకు బీరువా, కుర్చీల అందజేత

షాద్‌నగర్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని సోలీపూర్ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలకు గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు పంతులు గురువారం బీరువా, కుర్చీలను అందజేశారు. పాఠశాలలో రికార్డులు భద్రపరుచుకునేందుకు బీరువా, ఉపాధ్యాయులు కూర్చోవడానికి కుర్చీలు అవసరమని పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ కోరడంతో ప్రధానోపాధ్యాయుడి అభ్యర్థన మేరకు గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు పంతులు పాఠశాలకు బీరువా, కుర్చీలను అందజేశారు. విద్యార్థుల అభివృద్ధికి, మౌలిక వసతులు కల్పించేందుకు తమవంతు సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాలకు బీరువా, కుర్చీలను అందజేస్తున్న వెంకటేశ్వరరావు

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద గురువారం అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు వచ్చిన సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ పత్రాలను ఆయన అందజేశారు. చేవెళ్ల మండలంలోని దామరగిద్ద గ్రామానికి చెందిన నర్సింలుకు రూ.2.50లక్షలు, నవాబుపేట మండలం పులుమామిడి గ్రామానికి చెందిన పి. మాణిక్యంకు రూ.2.50లక్షలు, మొయినాబాద్ మండలంలోని చిన్న మంగళారం గ్రామానికి చెందిన డానియల్‌కు 1లక్ష రూపాయలు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరయ్యాయి. కార్యక్రమంలో నాయకులు వీరేందర్‌రెడ్డి, డి.వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డి, కృష్ణారెడ్డి, రాములు, శైలజ, సమత, యాదయ్య, టి.శ్రీను, శ్రీకాంత్, పెంటయ్యగౌడ్, రవీందర్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు ఉన్నారు.



బాధితులకు ఎల్‌ఓసీ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు